క్లుప్తంగా

మంత్రులను కలిసిన రేషన్ డీలర్లు



మంత్రి హరీశ్‌రావుతో రేషన్ డీలర్లు

న్యాల్‌కల్(జహీరాబాద్): తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం రేషన్‌డీలర్లు సచివాలయానికి తరలివెళ్లారు. అక్కడ మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమాలకర్‌ను కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని కోరగా సానుకూలంగా స్పందించినట్టు రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు పాండురంగారెడ్డి తెలిపారు. ప్రస్తుతం ఇస్తున్న కమీషన్ రూ.70 నుంచి రూ.140 పెంచడంతో పాటు ఇన్సూరెన్స్, హెల్త్‌కార్డులను ఇచ్చేందుకు హామీ ఇచ్చినట్లు తెలిపారు.

మంత్రి హరీష్‌రావును కలిసిన తన్వీర్

జహీరాబాద్: టీఎస్ఐడీసీ చైర్మన్ ఎండీ తన్వీర్ తన జన్మదినాన్ని పురస్కరించుకుని మంత్రి మంగళవారం ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావును క్యాంపు కార్యాలయంలో కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నామ రవికిరణ్, రాములు నేత, మోతిరాం, హన్నాన్ జావీద్, బాల్‌రెడ్డి, అబ్దుల్లా పాల్గొన్నారు.

స్పౌస్ టీచర్ల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న టీచర్లు

వట్‌పల్లి(అందోల్): స్పౌస్ టీచర్లకు 10 పాయింట్లు కేటాయించడంపై మంగళవారం మండలంలోని మర్వెల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో నాన్ స్పౌస్ టీచర్లు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం టీచర్ల బదిలీలలో స్పౌస్ టీచర్లకు 10పాయింట్లు కలపడం ద్వారా హెచ్‌ఆర్ఏ సౌకర్యం ఉన్న ప్రదేశాలకు వెళ్తుండటంతో నాన్ స్పౌస్ ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వాపోయారు. దీంతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీదేవి, సరిత, సాయిలీల, నాగిరెడ్డి, నాజర్‌పటేల్, చంద్రశేఖర్, జైపాల్, విజయ్‌రావు, శివకుమార్, సరస్వతి, మహేష్ పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులు ప్రారంభం

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను బుధవారం ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ వీరస్వామిగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో రూ.75,50 లక్షలతో నిర్మించిన అధునాతన గ్రామపంచాయతీ భవనం, రూ.26 లక్షలతో నిర్మించిన శ్మశానవాటిక ప్రహరీ, సీసీ రోడ్లు, మురుగు కాలువలను ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

అనాథలను గుర్తించండి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): తల్లిదండ్రులు మృతి చెంది సంరక్షకుల చేతిలో పెరుగుతున్న అనాథ పిల్లల వివరాలను సేకరించాలని బొల్లారం మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి ఆయా శాఖల అధికారులకు సూచించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు, బిల్‌కలెక్టర్‌లు, రిసోర్స్ పర్సన్‌లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాకార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అనాథ పిల్లల వివరాలను సేకరించేందుకు తీసుకోవాల్సిన చర్యలను కమిషనర్ వివరించారు. కార్యక్రమంలో ఆర్వో శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు



కిష్టయ్య

వట్‌పల్లి(అందోల్): ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం జోగిపేటలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వట్‌పల్లి మండల పరిధిలోని నిర్జప్ల గ్రామానికి చెందిన ఓటాబంధీ గ్రామసేవకుడు కొనింటి కిష్టయ్య మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్‌కు వెళ్తుండగా అందోల్ శివారులోని ఆర్డీవో కార్యాలయ సమీపానికి రాగానే నారాయణఖేడ్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కిష్టయ్య ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో కిష్టయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బాధితుడిని జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ట్రైడెంట్‌లో క్రషింగ్ చేపట్టాలి

అఖిలపక్ష నాయకుల డిమాండ్



నినాదాలు చేస్తున్న నాయకులు, రైతులు

జహీరాబాద్ టౌన్: చెరకు రైతులను విస్మరించడం తగదని అఖిలపక్ష నాయకులు అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీజేఎస్ నియోజకవర్గం అధ్యక్షుడు ఆశప్ప, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి, బీఎస్పీ ఇన్‌చార్జి సిద్దురావణ్ మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంతంలో అధిక విస్తీర్ణంలో చెరకు పంటసాగవుతుందన్నారు. చెరకు పంటను క్రషింగ్ చేయడానికి కొత్తూర్(బి) వద్ద దశాబ్దాల క్రితం ప్రభుత్వం చక్కెర కర్మాగారం ఏర్పాటు చేయగా మాజీ సీఎం చంద్రబాబునాయుడు నిజాం చక్కెర కర్మాగారాన్ని అమ్మివేశారన్నారు. అప్పటి నుంచి చెరకు రైతులు కష్టనష్టాలు ఎదుర్కోవాల్సి వస్తోందని వాపోయారు. ట్రైడెంట్ చక్కెర కర్మాగారం యాజమాన్యం గతేడాదికి సంబంధించి రూ.14 కోట్ల బకాయిలను రైతులకు చెల్లించాల్సి ఉందన్నారు. బిల్లులు చెల్లించకుండా కర్మాగారం ఆస్తులను అమ్మడం సరికాదని సూచించారు. 2023–24 సంవత్సరం సీజన్‌కుగాను ట్రైడెంట్ చక్కెర కర్మాగారంలో క్రషింగ్ చేపట్టాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జేబులు నింపేందుకే దళితబంధు

- అఖిలపక్ష నాయకుల ఆరోపణ
- సదాశివపేటలో వాడీవేడిగా రౌండ్‌టేబుల్ సమావేశం

సదాశివపేట (సంగారెడ్డి): సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ నాయకుల జేబులు నింపేందుకు దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టి అణగారిన వర్గాల దళితులకు అన్యాయం చేస్తున్నారని అఖిలపక్ష నాయకులు ఆరోపించారు. మంగళవారం సదాశివపేటలో బహుజనసేన స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డప్పు రాజు అధ్యక్షతన దళితబంధు పథకం ఎంపికలో జరుగుతున్న అక్రమాలపై అఖిలపక్ష పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు తుల్జారెడ్డి, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ బీఆర్ఎస్‌లో పనిచేస్తూ ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ ఆర్థికంగా ఉన్నవారికి దళితబంధు కేటాయించడంపై మండిపడ్డారు.

విచారణ జరిపించాలి..

సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్‌చారి, బహుజన సేన స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డప్పు రాజు మాట్లాడుతూ దళితబంధు పథకం అమలుపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. జనసేన అసెంబ్లీ కోఆర్డినేటర్ సాకేత్ సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు తాజొద్దీన్ కార్యవర్గ సభ్యుడు షఫీ హైమద్ మాట్లాడుతూ దళితబంధు పథకం కోసం ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి లక్ష్మి, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు శంకరప్ప, టీడీపీ మండల అధ్యక్షుడు అయ్యప్పస్వామి, జనసేన నాయకులు ఉదయ్, శ్రీకాంత్, సుదర్శన్, వైఎస్ఆర్టీపీ నాయకులు మల్లేశం, సీపీఐ నాయకులు వినోద, రమేష్, బుజ్జమ్మ పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే ఆరోగ్యం

- పెరుగుతున్న కండ్ల కలక కేసులు
- సొంత వైద్యం వద్దంటున్న వైద్యులు



కళ్లను పరీక్షిస్తున్న వైద్యురాలు

పటాన్‌చెరు టౌన్: చిన్నా పెద్దా తేడా లేకుండా కండ్ల కలక సమస్య వేధిస్తోంది. కంజక్టివిటీస్ ఐ ఫ్లూగా పిలువబడే ఈ వైరస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుందని, అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు తీసుకుంటే నివారించవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి రోజు 40 మందికి పైగా ఈ బాధితులు చికిత్స కోసం వస్తున్నారని వైద్యులు చెబుతున్నారు. ఈ క్రమంలో కండ్ల కలక నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిపుణులు వివరిస్తున్నారు.

జాగ్రత్తలు..

కండ్లు ఎర్రబారడం, దురద, కంట్లో నుంచి నీరు కారడం. కంటి రెప్పలు ఉబ్బిపోయి రాత్రి పడుకునే సమయంలో అతుక్కొని పోతాయి. కళ్లకు ఊసులు వస్తాయి. వీటి నివారణకు చల్లని నీటితో కళ్ళను శుభ్రంగా కడుక్కోవాలి. కళ్లను ఎక్కువగా నలపకూడదు. ఇతరులకు సోకకుండా కళ్లద్దాలను ధరించాలి. తరచూ చేతులను సబ్బు, శానిటైజర్‌తో శుభ్రం చేసుకోవాలి. కండ్లకలక వచ్చినవారు వాడిన టవాల్‌ను మరొకరు వాడకూడదు. పరిసరాలు పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం అవసరం.

వైద్యులను సంప్రదించాలి

కండ్ల కలక వచ్చిన వారు సొంతంగా వైద్యం చేసుకోవద్దు. సకాలంలో వైద్యులను సంప్రదించి వారి సూచన మేరకు మందులను వాడాలి. ప్రభుత్వ ఆస్పత్రిలో కండ్ల కలక నివారణకు మందులు అందుబాటులో ఉన్నాయి.

– అరుణ కుమారి, ప్రభుత్వ ఆస్పత్రి సివిల్ సర్జన్, ఆప్తమాలజీ

మహాధర్నాను జయప్రదం చేయండి

పటాన్‌చెరు టౌన్: మెదక్ పట్టణ కేంద్రంలో ఈ నెల 10వ తేదీన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపుపై నిర్వహించనున్న చలో మెదక్ బీజేపీ మహాధర్నాను జయప్రదం చేయాలని ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఇస్నాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అర్హులైన పేదలకు కేటాయించేవరకు పోరాడుతామన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవేందర్‌గౌడ్, భారతినగర్ డివిజన్ అధ్యక్షుడు మన్నే శ్రీకాంత్, పటాన్‌చెరు పట్టణ అధ్యక్షుడు నాగరాజుయాదవ్, మండల ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల పరికరంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సంగారెడ్డి టౌన్: పత్తిలో కలుపుతీసి ఎరువులు వేసే పరికరాలపై మండలంలోని పసల్వాది గ్రామంలో సంగారెడ్డి మండల వ్యవసాయ అధికారి ప్రసాద్ పత్తి, వరి పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో కొనుగోలు తుంచడం, పత్తిలో కలుపుతీసి ఎరువులు వేసే పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యంత్రపరికరంతో కాండం తొలుచు పురుగు ఉధృత్తిని తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో సంగుపేట శాస్త్రవేత్త సరిత, ఏఈఓ శ్రవణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం కేసీఆర్



రామచంద్రాపురం: చెక్కులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సింధు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పేదల పక్షపాతి సీఎం కేసీఆర్ అని భారతినగర్ డివిజన్ కార్పొరేటర్ సింధు అన్నారు. మంగళవారం ఎల్ఐజీ కాలనీ వార్డు కార్యాలయంలో 22మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రమేష్, మాజీ కార్పొరేటర్ అంజయ్యయాదవ్, జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ కుమార్‌గౌడ్, నాయకులు సత్యనారాయణ, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఓటర్ నమోదు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌పై ఆర్ఐ శ్రీకాంత్ అవగాహన కల్పించారు.

ఆడబిడ్డలకు అండగా ప్రభుత్వం

పటాన్‌చెరు టౌన్: పేదింటి ఆడబిడ్డలకు ప్రభుత్వం అండగా ఉందని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని పలు మండలాలకు చెందిన లబ్ధిదారులకు మంగళవారం జీహెచ్ఎంసీ వార్డ్ కార్యాలయంలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆర్ఐ శ్రీకాంత్‌తో కలిసి అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

- మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి



మొక్కలను పంపిణీ చేస్తున్న చైర్మన్, కమిషనర్

పటాన్‌చెరు: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. 9వ విడత హరితహారంలో భాగంగా మంగళవారం మున్సిపల్ పరిధిలోని 3, 4, 5, 6 వార్డులలో కాలనీవాసులకు మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, కౌన్సిలర్ పట్లోళ్ల కల్పన, ఉపేందర్‌రెడ్డి, చంద్రకళగోపాల్, బిజిలి రాజు, మహాదేవ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు రాములు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సంజీవరెడ్డి, లయన్స్ క్లబ్ బాధ్యులు

నారాయణఖేడ్: యువత చేతుల్లోనే దేశ భవిష్యత్ ఉందని పీకేఆర్ ట్రస్టు చైర్మన్, ఖేడ్ లయన్స్‌క్లబ్ చార్టర్ అధ్యక్షుడు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. లయన్స్‌క్లబ్ సహకారంతో పీకేఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 16, 17 తేదీల్లో మండల పరిధిలోని జుజాల్‌పూర్ శివారులోని హెచ్‌ఆర్ ప్యాలేస్ ఫంక్షన్‌హాల్‌లో ఇంపాక్ట్‌లో భాగంగా నిర్వహించనున్న సమగ్ర వ్యక్తిత్వ వికాస శిక్షణాతరగతులకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ యువత చక్కటి భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలనే ఉద్దేశ్యంతో ఉచితంగా శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని యువత అధికసంఖ్యలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లయన్స్‌క్లబ్ బాధ్యులు భోజిరెడ్డి, నర్సింహ్మారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

కొండాపూర్(సంగారెడ్డి): తెలంగాణ యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో జిల్లా స్థాయి యోగా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 184 మంది విద్యార్థులు పాల్గొనగా వీరిలో 34 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు యోగాసనా స్పోర్ట్స్ జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్ తెలిపారు. అనంతరం ఎంపికైన విద్యార్థులకు డీఈఓ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా మెమెంటోలతో పాటు సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ యోగా ప్రాణాయామంతో ఆరోగ్యంగా ఉంటారన్నారు. క్రమం తప్పకుండా యోగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విజయకుమార్ ప్రధాన కార్యదర్శి రమేష్ వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, గోపాల్, గీత, శ్రీదేవి పాల్గొన్నారు.

దళితులపై వివక్ష చూపడం తగదు

- నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): దళితులపై ప్రభుత్వం వివక్ష చూపడం తగదని, అర్హులైన దళితులందరికీ దళితబంధు పథకాన్ని వర్తింపజేయాలని పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. దళితబంధు పథకం అమలు విషయంలో ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బొల్లారం మున్సిపాలిటీ కేంద్రంలో మంగళవారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ అధికార పార్టీకి చెందిన దళితులకు మాత్రమే దళితబంధు పథకానికి ఎంపిక చేయడం సరైంది కాదన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, మహిళా జిల్లా అధ్యక్షురాలు సుధా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ, ఎంపీపీ రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

అర్హులైనవారికే దళితబంధు ఇవ్వాలి

సంగారెడ్డి టౌన్: అర్హులైనవారికే దళితబంధు ఇవ్వాలని కోరుతూ దళితబంధు సాధన సమితి జిల్లా కన్వీనర్ పోలీస్ రామచందర్ ఆధ్వర్యంలో కల్హేర్ మండలానికి చెందిన యువకులు, మహిళలు సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. శ్రీకాంత్, జయమ్మ, గంగమ్మ, చంద్రమ్మ, స్వరూప, కేశవ్వ, గంగమ్మ పాల్గొన్నారు.

రైతుఖాతాలపై ఫ్రీజ్ ఎత్తివేయాలి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): రైతుల బ్యాంక్ ఖాతాలపై ఫ్రీజ్ ఎత్తివేయాలని మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పృథ్వీరాజ్, పట్లోళ్ల రవీందర్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని అంకెనపల్లి గ్రామంలో మంగళవారం రైతులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సదాశివపేట పట్టణంలోని ఎస్‌బీఐ తదితర బ్యాంకులు రైతుల ఖాతాల్లో జమవుతున్న రైతుబంధు, ఆసరా పెన్షన్లు తదితర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన డబ్బులను తీసుకోనివ్వకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకుల అధికారులు వెంటనే స్పందించి రైతుఖాతాలపై ఫ్రీజ్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు మణయ్య, శ్రీశైలం, విఠల్ పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న హనుమంతరావు

సంగారెడ్డి టౌన్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు అన్నారు. మంగళవారం సంగారెడ్డిలోని రాజంపేట ఉర్దూ మీడియం పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదుకుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ప్రిన్సిపాల్ శోభారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సమస్యలను పరిష్కరించాలి

సంగారెడ్డి టౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ సంగారెడ్డి మున్సిపాలిటీలో కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. మున్సిపల్ యూనియన్ నాయకులు సువర్ణ, వేణు, మల్లేశం, రాజు, లక్ష్మి, సంగీత, వీరేశం పాల్గొన్నారు.

◆ హెచ్‌బీఎన్‌సీ కిట్ల పంపిణీ

న్యాల్‌కల్(జహీరాబాద్): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశలకు హెచ్‌బీఎన్‌సీ కట్లను వైద్యాధికారి స్వేతప్రియ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మార్తా, ఎంపీహెచ్‌ఓ మొగులయ్య, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

◆ పరామర్శ

జహీరాబాద్ టౌన్: మాజీ మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణగౌడ్‌ను మంగళవారం ఎమ్మెల్యే మాణిక్‌రావు పరామర్శించారు. మురళీకృష్ణ గౌడ్ తండ్రి ఇటీవల మృతి చెందగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులకు భరోసా కల్పించారు. అదేవిధంగా బీఆర్ఎస్ నాయకుడు జమీల్ ఖురేషీ తల్లి ఇటీవల మృతి చెందగా ఆయనను కూడా ఎమ్మెల్యే పరామర్శించారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు వెంట బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మొహియొద్దీన్, నాయకులు విజయ్‌కుమార్, వైజ్యనాథ్, బండి మోహన్ ఉన్నారు.

◆ తహసీల్దార్‌కు సన్మానం

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన గంగాభవానిని మంగళవారం జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఎంపీపీ ప్రవీణ, స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

◆ హుండీ ఆదాయం లెక్కింపు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకి సంగమేశ్వర ఆలయంలో హుండీ ఆదాయాన్ని ఆలయ పాలక మండలి చైర్మన్ వెంకటేశం, ఈఓ శశిధర్ ఆధ్వర్యంలో మంగళవారం లెక్కించారు. 55 రోజులుగా ఆలయంలో వివిధ ప్రాంతాల భక్తులు స్వామివారిని దర్శించుకుని సమర్పించిన నగదు రూ.19,94,739 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ అధికారులు, పాలక మండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

◆ కరపత్రం విడుదల

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ కాలనీలో బీహెచ్‌ఈఎల్ కార్మిక గుర్తింపు ఎన్నికల్లో భాగంగా మంగళవారం సీఐటీయూ కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య మాట్లాడుతూ ఉద్యోగ భద్రత, కార్మికుల హక్కుల సాధన, కార్మికులకు చట్టపరంగా రావాల్సిన సౌకర్యాలను కల్పించడం సీఐటీయూకే సాధ్యమన్నారు. బెల్ అధికార కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో సీఐటీయూని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ బెల్ అధ్యక్షుడు పెంటయ్య, నాయకులు శ్రీనివాస్, వీరన్‌రావు, రమేష్ పాల్గొన్నారు.

◆ ఓటు హక్కును నమోదు చేసుకోవాలి

కొండాపూర్(సంగారెడ్డి): 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సంగారెడ్డి తహశీల్దార్ షేక్ ఫరీనా అన్నారు. మంగళవారం సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటుహక్కు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయలక్ష్మీ, కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ఎయిడ్స్ వ్యాధికి మందు లేదని, నివారణే మార్గమని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డేనియల్ అన్నారు. ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలని కోరుతూ తారా డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

◆ సమస్యల పరిష్కారానికి కృషి

పటాన్‌చెరు టౌన్: డివిజన్‌లో పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని చాకలి బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు బస్తీలో డ్రైనేజీ వ్యవస్థ సరిగాలేకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోందని కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన కార్పొరేటర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ ప్రవీణ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

◆ ఏఎన్ఎంలను ఉద్యోగులుగా గుర్తించాలి

కొండాపూర్(సంగారెడ్డి): వైద్యశాఖలో పనిచేస్తున్న ఎన్‌హెచ్ఎంలు, సెకండ్ ఏఎన్ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎన్‌హెచ్ఎం, ఏఎన్ఎంలు సీఎం కేసీఆర్‌కు పోస్టుకార్డులను రాసి పంపించారు. ఈ సందర్భంగా బోయిని ప్రసాద్ మాట్లాడుతూ తక్షణమే కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేసి తక్షణమే ఎన్‌హెచ్ఎంలు, సెకండ్ ఏఎన్ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

◆ ఎరువులు, విత్తనాల దుకాణం తనిఖీ

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రాఘవాపూర్‌లో బసవలింగేశ్వర ఎరువులు, పురుగు మందుల విక్రయ దుకాణాన్ని మంగళవారం ఎంఏఓ లావణ్య తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ప్రస్తుతం పంటలకు పురుగు మందులు పిచికారీ చేస్తున్నందునా మందుల వివరాలను సూచించే బోర్డుపై ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.